క్లుప్తంగా

అమర వీరులకు ఘన నివాళి

బోట్‌క్లబ్: ఇటీవల పహల్గాం ఉగ్రదాడిలో బలైన 26 మంది అమర వీరులకు బీజేపీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ పిరికి పందలైన ఉగ్రవాదులు మన సైనికులను ఎదుర్కొనలేక పర్యాటకులపై కాల్పులు జరపడం అమానుషమన్నారు. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గట్టిగా బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జి పానుగుపాటి చిన సుబ్బారావు మాట్లాడుతూ ఉగ్రదాడి జరిగి నేటికి 13 రోజులైన సందర్భంగా మరణించిన వారికి ఘన నివాళులు అర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాలకొండయ్య, గట్టి సత్యనారాయణ, పైడా వెంకట నారాయణ, చోడిశెట్టి సత్యనారాయణ, పెండెం శ్రీదేవి, గూడూరు పద్మ పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరాల్లో ఉచిత అన్నదానం

బోట్‌క్లబ్: బద్రీనాథ్‌లో ఈ నెల 15వ తేదీ నుంచి 26 వరకూ జరిగే సరస్వతీ నదీ పుష్కరాల్లో ఉచిత అన్నదానం చేయనున్నట్టు శ్రీకంత బాలాజీ తెలిపారు. దాతల సహకారంతో అన్నదానం కోసం సేకరించిన నిత్యావసర వస్తువుల లారీని స్థానిక గోకులం వద్ద సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ పుష్కరాల్లో ప్రతి రోజు నిత్యాన్నదానం చేయనున్నట్టు చెప్పారు. రోటరీ సభ్యుడు ధనసాగర్ ప్రసాద్ మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమానికి నిత్యావర వస్తువులు, నగదు ఇచ్చిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు శ్రీకాంత్ శిష్లల, సభ్యులు నేతి నాగేశ్వరరావు, పాడిశెట్టి సుబ్రహ్మణ్యం, చోడిశెట్టి పద్దరాజు, చార్మినార్ వర్మ, చిట్టూరి వరప్రసాద్, పబ్బినీడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలి



జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

బోట్‌క్లబ్: స్థానిక డైరీఫారం సెంటర్‌లో ఉన్న మున్సిపల్ ప్రైమరీ పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చాలని బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గట్టి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ ప్రాంతంలో ఉన్నత పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చాలా మంది విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లలేక చదువులు మానేస్తున్నారన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను డైరీ ఫారం సెంటర్ నుంచి సినిమా రోడ్డులోని ఆనందభారతి హైస్కూల్, గొడారిగుంట మున్సిపల్ హైస్కూల్‌కు, సాలిపేట మున్సిపల్ హైస్కూల్‌కు పంపించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రతిరోజు ఆటోలు వెళ్లాలంటే ఆర్థిక భారం కావడంతో నిరుపేదలు తమ పిల్లలను చదువుకు దూరం చేస్తున్నారన్నారు. దీనికి స్పందించిన డీఈఓ ఉన్నతాధికారులు దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెక్కా రమేష్, దొడ్డి వీరేంద్ర, చిట్టిబాబు, తిరుపతిరావు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్‌కు అభినందన



విద్యార్థిని నిహాంజనిని అభినందిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: పదో తరగతి పరీక్షల్లో స్టేట్ టాపర్‌గా నిలిచి 600లకి గాను 600 మార్కులు సాధించిన కాకినాడ విద్యార్థిని నిహాంజనిని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం విద్యార్థినితోపాటు ఆమె తల్లిదండ్రులు శ్రీనివాసరావు, గంగాభవానిలను కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సత్కరించారు. ఉన్నత విద్యల్లో రాణించి సమాజానికి తద్వారా దేశానికి సేవలందించాలన్నారు. మరింతగా రాణించేందుకు శాఖ నుంచి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఎస్పీ అన్నారు.

విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థి

కాకినాడ క్రైం: ఆదిత్య యూనివర్సిటీ వైస్ చైర్మన్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులు రక్తదానం చేశారు. సోమవారం శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్ చైర్మన్ బొల్లం సతీష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఏ రమేష్ ఈ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 200 మంది విద్యార్థులు రక్తదానం చేశారు.



తిమ్మాపురంలో ధాన్యం ఆరబెడుతున్న రైతులు



తిమ్మాపురంలో అకాల వర్షానికి నేలను తాకిన వరిచేలు

అన్నదాత ఆర్తనాదాలు..!

- రైతులకు శాపంగా అకాల వర్షాలు
- దళారుల దోపిడీతో తీవ్రంగా నష్టపోతున్న కర్షకులు
- కాకినాడ రూరల్‌లో సగం ఆయకట్టులో పూర్తి కాని మసూళ్లు

కాకినాడ రూరల్: అన్నదాతకు అకాల వర్షాలు శాపంగా మారాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి రబీ పంటను సాగు చేసిన రైతన్నలు పంటను చేతికి అందే తరుణంలో అకాల వర్షాలకు నష్టపోతున్నారు. ఒక పక్క ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర లభించక మరో పక్క దళారులు చేతుల్లో తక్కువ ధరలకే ధాన్యం విక్రయించి తీవ్రంగా నష్టపోతూ అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు. ప్రస్తుతం రబీ మసూళ్లు చురుగ్గా జరుగుతున్నా శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు పడిన అకాల వర్షాలకు రైతులు కుదేలయ్యారు. కోతకు సిద్ధంగా ఉన్న వరిచేలు, ధాన్యపు రాసులు వర్షానికి దెబ్బతినడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రబీ సాగు కోసం ఈ సీజన్‌లో సంక్రాంతి పండగ ముందు అప్పులు చేసి నాట్లు, వెదజల్లు పద్ధతిలో రైతులు సన్న రకాలతో పాటు బొండాలు రకం సాగు చేపట్టారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో సుమారు 17,749 ఎకరాలలో రబీ వరి సాగును రైతులు చేశారు. కరప మండలంలో అత్యధికంగా 13,389 ఎకరాలలో కాకినాడ రూరల్‌లో 4360 ఎకరాలలో పంట పండించారు. **ఇప్పటికే కరప మండలంలో 9758 ఎకరాలలో, కాకినాడ రూరల్‌లో 1425 ఎకరాలలో కోతలు పూర్తవ్వగా మిగిలిన వరి చేలు రానున్న మూడు రోజుల్లో పూర్తయ్యే అవకాశం** ఉంది. ఇప్పటికే కోతలు పూర్తయిన చేలలో కొన్ని మసూళ్లు పూర్తవ్వగా కరపలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 7,300 మెట్రిక్ టన్నులు, కాకినాడ రూరల్లో 850 మెట్రిక్ టన్నులు ధాన్యం విక్రయించారు. మిగిలిన ప్రైవేట్‌గా కరపలో 14,101 మెట్రిక్ టన్నులు, కాకినాడ రూరల్‌లో 945 మెట్రిక్ టన్నులు ధాన్యం అమ్మకాలు జరిగాయి. మిగిలిన ధాన్యం అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఓపెన్ మార్కెట్‌లో దళారులు సన్నాలు రకం ధాన్యం బస్తా రూ.1300 చొప్పున, బొండాలు రకం ధాన్యం బస్తాకు రూ.1200 చొప్పున ధర ఇవ్వడంతో రైతులు నష్టపోతున్నారు. కాకినాడ రూరల్‌లో సర్పవరం, చీడిగ, కొవ్వూరు, తిమ్మాపురం, పండూరు తదితర గ్రామాలలో వర్షాలు ధాన్యం రాసులు తడిసిపోవడంతో రైతులు వాటిని ఆరబెట్టుకుంటున్నారు. రబీ కోతలు సమయంలో వర్షాలు వలన రైతులకు ఇబ్బందికరంగా మారిందని, తడిసిన ధ్యానం కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామని ఏఓ సత్యనారాయణ తెలిపారు.



వలసపాకల లే అవుట్‌లో ఆరపెట్టిన ధాన్యం

అన్నదాతకు అకాల వర్షం తెచ్చిపెట్టిన కష్టాలు

కరప: మండల పరిధిలో ఆదివారం కురిసిన అకాల వర్షం కష్టాలు తెచ్చిపెట్టింది. ధాన్యం రాశులు తడిసిపోయి, కోసిన చేలు పనమీద ఉండడంతో నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో 13 వేల ఎకరాలలో రబీపంట సాగు చేశారు. గత ఏడాది తొలకరిలో అంతంతమాత్రపు దిగుబడులతో రైతులకు నష్టం వాటిల్లింది. తొలకరి నష్టాల నుంచి గట్టెక్కాలని కోటి ఆశలతో రబీ సాగు చేస్తే, పంట చేతికి అందివచ్చిన సమయంలో అకాల వర్షం తీరని దెబ్బతీసిందని రైతులు వాపోతున్నారు.

ముందుగా నాటిన పొలాల్లో కోతలు పూర్తవ్వగా ఆలస్యమైన ప్రాంతాల్లో మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎండలు బాగా కాస్తుండడంతో కూలీలు, మెషీన్లతో వ్యవసాయ పనులు జోరుగా జరుగుతున్నాయి. వరికోత యంత్రాలతో కోసిన ధాన్యం మళ్లల్లో, రోడ్డు పక్క, లే అవుట్లలో రాశులు చేసి ఉంచారు. కోత, నూర్పిడి యంత్రంతో కోసిన మళ్లల్లో గడ్డిని రెండు మూడు రోజులు ఎండిన తర్వాత పశుగ్రాసం కోసం గట్టుకు తెచ్చుకుని గట్టిమేటులు వేసుకుంటారు. సోమవారం ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. దీని కోసం అదనపు ఖర్చు అవుతోందని రైతులు వాపోతున్నారు. అధికారులు, నాయకులు స్పందించి తేమ శాతం చూడకుండా ధాన్యాన్ని మద్దతు ధరకు కొనేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పంట చేతికి వచ్చే వరకు ఆందోళనే



తిమ్మాపురం గ్రామంలో 12ఎకరాలలో రబీ వరి సాగు చేపట్టాను. సొంతం 2.5ఎకరాలు మిలిగిన 9.5ఎకరాలు కౌలుకు సాగు చేస్తున్నాను. కౌలు కాకుండా ఎకరాకు రూ.30 వేలు వరకు పెట్టుబడి అయ్యింది. ప్రస్తుతం దిగుబడులు బాగున్నప్పటికీ గిట్టుబాటు ధరలు బాగా లేవు, సాధన సన్నాలు రకం సాగు చేయగా బస్తా రూ.1300 వరకు బయట ధర పలుకడంతో తీవ్రంగా నష్టపోవల్సి వస్తుంది. వర్షాలు వలన ఇంకా కోతలు ప్రారంభించ లేదు.

– తోట సత్యనారాయణ, రైతు, తిమ్మాపురం

నిబంధనలు సడలించాలి



అకాల వర్షం దెబ్బతీసింది. నేను 9 ఎకరాలలో సన్నాలు రకం రబీ వరిసాగు చేశాను. ధాన్యం కొనుగోలుకు దళారులు తక్కువ ధరకు అడగడంతో రైతు సేవా కేంద్రాలకు విక్రయించేందుకు ఆరబెడుతుండగా అకాల వర్షాలు వచ్చాయి. బరకాలను కప్పి ధాన్యం కాపాడుకున్నాం. ఆరుదల వచ్చాక అమ్మకం చేస్తాం. తేమ శాతం, ఇతర నిబంధనలు సడలించి రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలి.

– అనుసూరి మహాలక్ష్మి, కౌలు రైతు, తిమ్మాపురం

రైతు సేవా కేంద్రాల్లో కొనడం లేదు



3ఎకరాలు కౌలుకు సాగుచేశాను, సగం కోసి రాసి చేస్తే వర్షానికి తడిసిపోయింది. రైతు సేవా కేంద్రంలోకి వెళ్లి అడిగితే సీఎంఆర్‌లో తీసుకోవడంలేదంటున్నారు. బయట అమ్ముదామంటే 75 కిలోల బస్తా రూ.1450 అంటున్నారు. తడిసిపోయిన రాశులను విడదీసి ఆరబెట్టుకుంటున్నాను. మిగిలిన సగం చేలో పంట నేలనంటి, తడిసిపోయింది. సాధారణంగా ఎకరం చేను మెషీన్‌తో కోస్తే గంటన్నర పడుతుంది. పడిపోయిన చేను కోయించాలంటే నాలుగైదు గంటలు పడుతుంది. అదనంగా ఖర్చవుతుంది. దిగుబడులు ఎకరానికి 40 నుంచి 45 బస్తాలు వస్తున్నాయి. కానీ పెట్టుబడులు, ఖర్చులు పోతే ఏమీ మిగిలేటట్టు లేదు. ప్రభుత్వం స్పందించి మద్దతు ధరకు కొనుగోలు చేస్తే అప్పుల నుంచి గట్టెక్కుతాం. మద్దతు ధరకు కొనేలా చర్యలు తీసుకోవాలి.

– మాచిబోయిన తాతయ్య, కౌలురైతు, వలసపాకల, కరపమండలం

తక్కువ ధరకు అమ్ముకోవద్దు!

కాకినాడ రూరల్: అకాల వర్షం కారణంగా రైతులకు అపార నష్టం కలిగిందని, వర్షాల వలన నష్టపోయిన రైతులు తొందర పడి మధ్యవర్తులు, దళారులకు పంటను తక్కువ ధరకు అమ్మవద్దని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. సోమవారం ఆయన జిల్లాలో పర్యటించి అకాల వర్షాలు దెబ్బతిన్న వరిచేలు, తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం కాకినాడ రూరల్ మండలం చీడిగలో పర్యటించారు. మంత్రితో పాటు రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, పౌర సరఫరా సంస్థ మేనేజరు దేవుల నాయక్, జేడీఏ విజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.



చీడిగ వద్ద తడిసిన ధాన్యాన్ని వివరాలు రైతు నుంచి తెలుసుకుంటున్న మంత్రి

ఆర్టీసీ కాంప్లెక్స్‌కు కూలర్ బహూకరణ

బాలాజీచెరువు: కాకినాడ ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం చల్లని తాగునీరు అందించేందుకు రూ.1.10లక్షల విలువ గల కూలర్‌ను రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ 1978 చారిటబుల్ ట్రస్ట్ అందజేసింది. ఈ సందర్భంగా కాకినాడ ఆర్టీసీ మేనేజర్ మనోహర్ మాట్లాడుతూ కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ 1978 చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కి చెందిన గుమ్మిడిల్లి కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో వాటర్ కూలర్ ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. ప్రతిరోజు 5వేల మందికి పైగా విద్యార్థులు, ప్రయాణికులు కాంప్లెక్స్‌కు వచ్చి వెళ్తుంటారని, వీరందరికి ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ట్రస్ట్ సెక్రటరీ నేమాని కల్యాణి, ప్రసాద్ దంపతులు వాటర్ కూలర్‌ను ప్రారంభించారు. ట్రస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా ఇప్పటి వరకు కాకినాడ పరిసర ప్రాంతాలలో సుమారు 2.5 కోట్ల రూపాయలతో సామాజిక సేవా కార్యక్రమాలు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ట్రెజరర్ జగన్నాథరావు, శీమకుర్తి పాపారావు, అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ, స్టేషన్ మేనేజర్ వి. ర్మరావు, ఎస్.స్వామి, పీఆర్వో సి.హెచ్.వెంకట్రాజు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్టాండ్‌కు వాటర్ కూలర్‌ను అందజేసిన రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్

రూ.50 లక్షల వైద్య పరికరాల వితరణ

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌కు సీ పోర్ట్స్ లిమిటెడ్ యాజమాన్యం భారీ మొత్తం వెచ్చించి అధునాతన వైద్య పరికరాలు సమకూర్చింది. జీజీహెచ్‌లో పలు విభాగాల్లో ఏర్పాటు చేసిన ఈ పరికరాలను సంస్థ చైర్మన్ కేవీ రావు, కలెక్టర్ షణ్మోహన్ సంయుక్తంగా ప్రారంభించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి అతిథులుగా కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్, నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. కార్యక్రమంలో కేవీ రావు కేఎస్‌పీఎల్ సీవోవో మెర్ల మురళీధర్ మాట్లాడుతూ అనస్థీషియా విభాగంలోని ట్రామా ఐసీయూ కోసం రూ.55 లక్షలు విలువైన మూడు వెంటిలేటర్లు, 8 ఐసీయూ బెడ్లు, 8 మల్టీ పర్పస్ మానిటర్లు, గైనకాలజీ విభాగం కోసం మూడు ఓబీసీవై ఎగ్జామినేషన్ కోచ్‌లు సమకూర్చామన్నారు. సంస్థ నిర్ణయించిన వితరణ మొత్తం జీజీహెచ్‌కు మాత్రమే సమకూరేలా ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ విశేష కృషి చేశారని కొనియాడారు. ఏడాదిగా సంస్థను సంప్రదిస్తూ వచ్చారన్నారు. ఆ కృషిని గుర్తించి ఆయనే హెచ్‌వోడీగా పని చేసిన అనస్థీషియా డిపార్టుమెంట్‌కు సింహ భాగాన్ని కేటాయించి, అధునాతన పరికరాలు సమకూర్చామన్నారు. జీజీహెచ్‌లో పేద రోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందేందుకు తమ వంతు సహాయ సహకారాలను అన్నివేళలా అందిస్తామని కేవీ రావు అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ నిధులు ఇతర సేవా కార్యక్రమాలకు వినియోగించుకునే అవకాశం ఉన్నా రోగుల ప్రయోజనం కోసం జీజీహెచ్‌కు మాత్రమే కేటాయించాలనే ఆలోచన ప్రత్యక్షంగా ప్రాణదానమేనని కొనియాడారు. ఇందుకు కృషి చేసిన డాక్టర్ విష్ణువర్ధన్‌ను అభినందించారు. డాక్టర్ కేవీరావు, మెర్ల మురళీధర్‌ల సేవల నిరతిని అందిపుచ్చుకొని ఆసుపత్రి అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ సూపరింటెండెంట్ హోదాల్లో డాక్టర్ లావణ్యకుమారి, డాక్టర్ విఠల్‌లు ఎంతగానో కృషి చేశారన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ కేఎస్‌పీఎల్ యాజమాన్యాన్ని అభినందిస్తూ, జీజీహెచ్ నుంచి రోగులకు అందిస్తున్న వైద్య సదుపాయాలను వివరించారు. ఎంసీహెచ్ బ్లాక్ సిద్ధమైతే మరో 500 అదనపు పడకలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. అనంతరం కేఎస్‌పీఎల్ చైర్మన్‌ను ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యురాలు కర్రి పద్మశ్రీ సహా వైద్యాధికారులు పాల్గొన్నారు.



వైద్య ఉపకరణాల దాత కేఎస్‌పీఎల్ చైర్మన్ కేవీ రావును సత్కరిస్తున్న నాయకులు, కలెక్టర్

11న శారదా రామకృష్ణ సేవా సమితి ఆవిర్భావ వేడుకలు

సామర్లకోట: పీబీదేవం గ్రామంలో ఉన్న శారదా రామకృష్ణ సేవా సమితి 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 11వ తేదీన ప్రారంభమవుతాయని సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన సమితి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న తెల్లవారు జామున సుప్రభాత హారతితో విశేష పూజలు ప్రారంభమవుతాయని చెప్పారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

ముసిగిన యూత్ రెడ్‌క్రాస్ రాష్ట్ర స్థాయి సదస్సు

బాలాజీచెరువు: స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ, కాకినాడ శాఖ వారితో యూత్ రెడ్‌క్రాస్ రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించినట్టు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి సదస్సుకు ముఖ్య అతిథిగా జేఎన్టీయూ కాకినాడ ఉపకులపతి, ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ హాజరై మాట్లాడారు. సంఘజీవులం సమాజసేవకులం మనం భారతీయులమని ఐఆర్‌సీఎస్ గొప్ప లీడర్స్‌ను తయారు చేస్తోందని అన్నారు. నాలుగు రోజులు జరిగిన ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా యూత్ రెడ్ క్రాస్ స్టేట్ క్యాంప్ నిర్వహించామని అన్నారు. అనంతరం వలంటీర్లకు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ శిబిరానికి విచ్చేసి తమ అమూల్యమైన సందేశాన్ని విద్యార్థులకు అందించిన శిక్షకులకు కాకినాడ రెడ్ క్రాస్ వైస్ చైర్మన్, డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, సెక్రటరీ కె.శివకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కరుణ, ఐఆర్సీఎస్ సభ్యులు జి.శివరామకృష్ణ, నోడల్ ఆఫీసర్ తేజేశ్వరరావు, కోఆర్డినేటర్లు ఎస్ దుర్గా దేవి, ఎస్ సత్యనారాయణ, ఎస్ మల్లేశ్వరరావు, వి.చిరంజీవి, వి.నాగరాజు, వలంటీర్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేఎన్‌టీయుకే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్

పాక తీయాలంటే రూ.పది లక్షలు ఇవ్వాల్సిందే

కాకినాడ సిటీ: నా పాక ప్రభుత్వానికి చెందిన పోరంబోకు స్థలంలో వేశాను. అది తీయాంటే నీ పొలంలో రెండు సెంట్లు భూమి లేదా పది లక్షలు నగదు ఇవ్వాలంటూ ఓ ఆక్రమణదారుడు రైతుకు హుకుం జారీ చేశాడు. ఎంత మందితో చెప్పించినా పని అవ్వదని, అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ నా వైపు ఉన్నారని అందువల్ల నేను చెప్పిన డిమాండ్లకు నీవు తలొగ్గాల్సిందే అంటూ ఆ ఆక్రమణదారుడు తనను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పెదపూడి మండలం రామేశ్వరానికి చెందిన రైతు వంకా భాస్కరరావు సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతి పత్రాన్ని అందించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెదపూడి మండలం రామేశ్వరం గ్రామం నుంచి మాధవపట్నం వెళ్లే రెండో పుంత శ్మశానం రోడ్డు వద్ద తనకు 60 సెంట్లు పంట భూమి ఉందని భాస్కరరావు తెలిపారు. ఆ భూమిని ఆనుకొని ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డుపై దేసిశెట్టి దుర్గ అనే వ్యక్తి గేదెల పాక వేసుకొని ఆక్రమించాడని, తన భూమికి ఆనుకొని ఉన్న కాలువను జేసీబీతో తవ్వేసి, పొలానికి పంటకు నీరు రాకుండా పెద్ద గొయ్యి ఏర్పరిచారని తెలిపారు. ఇదేమని అడిగితే తనకు ఈ మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులతో సంబంధాలు ఉన్నాయని, తనను ఎవరూ ఏమీ చేయలేరని చెప్పారన్నారు. తను పాకను తొలగించాలంటే రెండు సెంట్లు భూమి లేదా రూ.10 లక్షల నగదు ఇచ్చుకోవాలంటూ ఇబ్బంది పెడుతున్నారని సంబంధిత అధికారులు వినతి పత్రాలు అందించినా ఇప్పటి వరకు స్పందించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేతికి వచ్చిన పంటను కోసుకొని ఆరబెట్టుకునే ఈ స్థలంలో దేసిశెట్టి దుర్గ పాకను వేసి, తనను బెదిరింపులకు దిగుతున్నాడని భాస్కరరావు అధికారులకు వివరించారు. తన స్థలానికి అడ్డుగా వేసిన పాకను తొలగించి తన పంట ఉత్పత్తులను తీసుకెళ్లేందుకు వీలుగా మార్గం కల్పించాలని అధికారులను కోరినట్లు తెలిపారు.

ట్రస్ట్ ఆఫ్ బొండా సేవలు అభినందనీయం

కరప: పేదలకు ట్రస్ట్ ఆఫ్ బొండా స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్రముఖ సమాజ సేవకుడు తలాటం రాము, పారిశ్రామికవేత్త చింతా సుబ్బారెడ్డి (పసలపూడి)లు పేర్కొన్నారు. వేళంగిలోని శ్రీనివాసా నర్సింగ్ హోమ్ ఆవరణలో సోమవారం జరిగిన ట్రస్ట్ ఆఫ్ బొండా 19వ అర్ధ సంవత్సర సమావేశంలో వారు మాట్లాడారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్, డాక్టర్ బొండా వెంకన్నారావు మాట్లాడుతూ తమకున్నంతలో పేదలకు సాయపడాలన్న ఉద్దేశంతో కుటుంబ సభ్యులతో కలిసి ట్రస్ట్ ఆఫ్ బొండా స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేశామని, పదేళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆరేళ్ల బాలికకు బేబీ సైకిల్, 500 మంది పేదలకు చీరలు, పంచెలు, తువాళ్లు ట్రస్ట్ సభ్యులు రాము, సుబ్బారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అతిథులను ట్రస్ట్‌సభ్యులు సత్కరించారు. ఇక్కడకు వచ్చిన పేదలకు డాల్ఫిన్ హోటల్ యజమాని బదిరెడ్డి వెంకన్న ఆహార ప్యాకెట్లను అందజేశారు. ట్రస్ట్ డైరెక్టర్స్ బీవీవీఎస్ఎస్ మూర్తి, డాక్టర్ బొండా సూర్యారావు, డాక్టర్ బి.రాజ్ కుమార్, లక్ష్మీకుమారి, అనితారాణి, హరిన, వేళంగి లయన్స్‌క్లబ్ ప్రతినిధులు బొడ్డు భాస్కరరామన్, చంద్రు వెంకన్నారావు, ఇళ్ల ఆదేశ్, గరగ రామయ్య, కుంచే అయ్యన్న, శాకా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వేళంగిలో బాలికకు బేబీ సైకిల్ అందజేస్తున్న అతిథులు, ట్రస్ట్ సభ్యులు

సమస్యలు పరిష్కరించాలి

సామర్లకోట: రైతుల ధాన్యం సమస్యలను పరిష్కరించాలని సివిల్ సప్లయ్ మేనేజింగ్ డైరెక్టరు జిలానీ నమూనీ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని అచ్చంపేట రైతు సేవా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దాంతో తేమ శాతం పేరుతో రైతులను అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వీరంరెడ్డి వసంతరాయుడు, సలాది రమేష్, యాళ్ల కాశీవిశ్వనాథం, ముమ్మిడి శ్రీనివాసు, సూరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో రైతులు బొండాలు ఎక్కువగా పండించడంతో బొయిలర్ రైసు మిల్లులు తక్కువగా ఉండడం, ఉన్న మిల్లులు దూరంగా ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. బొయిలర్ రైసు మిలులు బ్యాంకు గ్యారంటీ మిల్లు టార్గెట్‌కి లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదన్నారు. దీనికి తోడు గొనె సంచులు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉండడం లేదని, ఏదో రకంగా ధాన్యం మిల్లుకు తరలిస్తే ఆన్‌లోడ్‌లో జాప్యం జరుగుతుందని రైతులు వాపోయారు. ఆన్‌లైన్ నమోదు సకాలంలో చేయకపోవడంతో రైతులకు సొమ్ములు జాప్యం జరుగుతుందని తెలిపారు. ఏఓ ఐ.సత్య, తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



సివిల్ సప్లయ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు తమ గోడును వినిపిస్తున్న రైతులు

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

బాలాజీచెరువు: త్వరలో నిర్వహించనున్న మెగా డీఎస్సీ-2025కు హాజరవుతున్న నిరుద్యోగులకు ఉచితంగా కోచింగ్ అందించనున్నట్టు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన కాకినాడలో క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 16,347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహిస్తుందన్నారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలో ఆర్థికంగా వెనకబడిన నిరుద్యోగ యువతను ప్రోత్సహించేందుకు కాకినాడలో శ్యామ్ ఇనిస్టిట్యూట్ ద్వారా అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా మెరుగైన శిక్షణతోపాటు డైలీ టెస్ట్ సిరీస్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలోని నిరుద్యోగ యువత ఈనెల ఏడో తేదీలోపు గూగుల్ ప్లే స్టోర్ నుంచి 'శ్యామ్ ఇనిస్టిట్యూట్ ఆచార్య' యాప్‌ను ఇన్స్టాల్ చేసుకుని తగినన్ని వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కాకినాడ విద్యుత్ నగర్‌లో క్యాంప్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.